# రైలు వెళ్ళిపోయింది

"ఇదిగో ఇది టూ టైర్ లిస్టు! త్రీటైరు లిస్టు దాని కింద వుంది. ఆఖరి మూడు బెర్తులూ అనకాపల్లిలో ఎక్కుతామన్నారు. ఆ విషయం అప్పారావుకి చెప్పు లేకపోతే అర్థకీ, రూపాయికీ కక్కుర్తి పడి వాటిని నింపుకు వెళ్ళిపోతాడు. అనవసరపు గొడవ! అనుమానాలుంటే కబురుపెట్టు! నేను వెళ్తున్నాను"

రిజర్వేషన్ లిస్టులు రెండూ చలపతి ఎదర టేబిలు మీద పడేసి ఇవ్వాల్సిన సలహాలు ఇచ్చేసి, వెళ్ళిపోయాడు బుకింగ్ క్లర్క్. కాగితాలు చేతిలోనికి తీసుకున్నాడు చలపతి. కోటా బెర్తులు అన్నీ పూర్తిగా నిండిపోయాయి. ఇంకా వెయిటింగ్ లిస్టులో ఎనిమిది పేర్లున్నాయి.

అందులో నాలుగు పేర్లు స్త్రీలవి.

సీట్ల సంగతి సరేసరి!

సుమారు ఇరవైకి పైగా 'వెయిటింగ్ లిస్టు'లో వున్నాయి. ఇవి కాకుండా ప్లాట్‌ఫారం మీదకి రైలు వచ్చేక ఇంకా ఎంత మంది ఎగబడతారో?

సీట్లు, బెర్తులూ ఖాళీలేవు బాబూ' అంటూ అరిచి వాళ్ళకు సమాధానం చెప్పేసరికి ప్రాణం పోయినంత పనవుతుంది. మెయిలు ప్లాట్‌ఫారం మీద నిలబడిన అరగంటసేపు అష్టావధానం చేయాలి. ప్రాణం పోకుండా కాపాడుకోవాలి.

రోజూ అలవాటయిన పనే అయినా. ఆ అరగంటకష్టమూ తల్చుకుంటే నీరసం ముందుగానే ఆవహించింది. చలపతికి.

టికెట్ నెంబర్లు 'రిపీట్' అయిపోయాయోమోనని చెక్ చేసుకుంటున్నాడు.

"నమస్కారం సార్" తలెత్తి చూసేడు.

"రిజర్వేషన్ టి.సి. మీరేనా?"

అవునన్నట్లు అతడివంక చూస్తూ తలవూపేడు చలపతి

"నా భార్య కొచ్చిన్ వెళ్ళాలిసార్ ఒంటరిగా ప్రయాణిస్తోంది. పైగా నిండుమనిషి ఎలాగయినా ఒక్క బెర్తు కావాలిసార్" అతడు ఎంతో ప్రాధేయపూర్వకంగా అడిగేడు.

"లాభంలేదు, అన్నీ నిండిపోయాయి"

యధాలాపంగా అన్నాడు చలపతి

" అలా అంటే ఎలాసార్! ఒక్క బెర్తు సర్దితే మీ ఋణం వుంచుకోం ఇదిగో టిక్కెట్టు"

ఆ వ్యక్తి జేబులోని టికెట్ తీసి టేబిలుమీద వుంచేడు.

"కోటా నిండిపోయింది! లాభంలేదు"

"అలా అంటే ఎలా సార్"

"ఇవిగో లిస్టులు! వెయిటింగ్ లిస్ట్‌లో ఎంతమంది వున్నారో చూడండి! వీళ్ళని కాదని మీకెలా ఇవ్వగలను?"

"అంతే నాసార్" నిరాశగా అన్నాడా వ్యక్తి

"అంతే, నేనేం చేయలేను, సారీ" అంటూ లిస్టు లోని పేర్లు, టికెట్ నెంబర్లు సరిచూసుకోవటంలో మునిగిపోయాడు చలపతి.

అయితే ఆ వచ్చిన మనిషి కదలి వెళ్ళలేదు.

"సార్.... ఈ అయిదురూపాయలు వుంచండి" అంటూ మెల్లగా నోటు చలపతి చేతిలో వుంచబోయాడు.

"క్షమించండి! నాకు అలాటి అలవాట్లు లేవు"

చలపతి సీరియస్‌గా చెప్పేడు

ఆ వ్యక్తి ముఖం సిగ్గుతో ముడుచుకు పోయింది.

టేబిలు మీద టిక్కెట్టు తీసుకొని నిరాశగా బయటకు వెళ్ళిపోయాడు.

బయట నిలబడిన స్త్రీతో ఏదో చెప్తున్నాడు. ఆవిడ ఆ పెద్దమనిషి భార్య కాబోలు. నిండు గర్భిణి. ఆవిడను చూస్తే జాలికల్గింది చలపతికి!

మెయిల్లో రిజర్వేషను, ఫస్టుక్లాసు, ఎ.సి.బోగీలు పోగా మామూలు బోగీలు ఒకటీ రెండూ వుంటాయి. నిండుచూలాలు ఆ మామూలు బోగీల్లో నిలబడి మద్రాసు వరకు ప్రయాణం చేయటం మహాకష్టం.

ఈ విషయం చలపతికి తెలుసు

కానీ, వెయిటింగ్ లిస్టులో అంతమంది వుండగా అందరినీ తోసి రాజని ఆమెకు సీటుగాని, బెర్తుగాని ఎలాఇవ్వటం?

మాయ చేయాలంటే పేర్లు కాస్త కిందామీదా జరిపి ఏదో వ్యవహారం చెయ్యొచ్చును.

కానీ తాను ప్రాణంపోయినా అలాంటి పని చేయలేదు. అయిదూ, పదీ తీసుకుని అలాటిపనులు చేయగలిగివుంటే కొంతమంది రిజర్వేషన్ టి.సి.ల్లాగ తాను కూడా ఈసరికి ఒకటిరెండు మేడలు లేపగలిగివుండేవాడు.

ఆ గదిలోనే ఇంకో వారగా టి.సి. రామానుజం వున్నాడు. మూలకూర్చీలో కూర్చుని టిక్కెట్లు 'సార్ట్‌అవుట్' చేస్తున్నాడు.

"ఇంకా నీకు టెర్మ్‌ఎంతకాలం వుందోయ్?" అంటూ అడిగేడతడు.

"ఏ టెర్మ్?" అడిగేడు చలపతి

" అదే రిజర్వేషను టి.సి.గా."

"ఇంకో నెలరోజులుంది. ఈనెలరోజులూ సవ్యంగా గడిస్తే ఈ రొంపి నుండి

బయటపడతాను. ప్రాణం హాయిగా వుంటుంది"

రామానుజం గట్టిగా నవ్వేశాడు.

"నువ్వు భలేవాడివోయ్ మొత్తానికి"

చలపతి అతడి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"రిజర్వేషను టీ.సి. అంటే బంగారు పిచుకలాంటి పోస్టు. అలాటిదాన్ని పట్టుకుని నువ్వు రొంపి, రొచ్చు అని బాధపడిపోతున్నావు. ఆ పోస్టులో ఎవరున్నా సంవత్సరం తిరిగేసరికి ఒకలక్ష కళ్ళచూస్తారు. అయినా.... ప్రాప్తం వుండాలిలే"

చలపతి మాట్లాడలేదు.

రామానుజం చెప్పినదాంట్లో నిజంలేకపోలేదు.

ఒక్కో బెర్తుకూ మూడు రూపాయలనుండి అయిదు రూపాయల వరకూ సులువుగా లంచం సంపాదించవచ్చును. రైలులో ప్రయాణించే ప్రతివాళ్ళూ ఎక్కువ లగేజీతో ఎక్కువ సౌఖ్యం కోరుకుంటారు.

అటువంటి సౌఖ్యం లభించేదీ, సామానుకు రక్షణ దొరికేదీ, మామూలు మనిషికి సైతం అందుబాటులో వుండేదీ ఈ రిజర్వేషను బోగీలే.

మొదటి తరగతి ప్రయాణీకులు సైతం ఈ రోజుల్లో వీటికే ఎగబడుతున్నారు.

సూక్ష్మంలో మోక్షం కనుక

ముప్ఫయ్యో, నలభయ్యో ఖర్చుపెట్టి దూర ప్రయాణాలకు టిక్కెట్లు కొనుక్కుని, రిజర్వేషను నిమిత్తం అయిదు రూపాయలు పారెయ్యటం వాళ్ళకి పెద్ద కష్టమనిపించదు. కానీ, అది తీసుకోవటానికి తనకే ప్రాణం ఒప్పదు. సుమారు పదకొండు నెలలుగా ఈ పోస్టులో వున్నాడు తాను. ఒక్కరోజు కూడా చేయి జాపి ఎవరి దగ్గర నుండీ పైసా లంచం తీసుకోలేదు.

అందువల్ల అనేక కష్టనిష్ఠూరాలు కూడా పడవలసి వచ్చింది. అయినా సరే లంచం మాత్రం తీసుకోలేకపోయాడు. చెడు చేయటానికి కూడా కొంత గుండె నిబ్బరం కావాలి కాబోలు.

ఆ గుండె నిబ్బరం తనకు లేదు

'దయచేసి వినండి! హౌరా నుండి మద్రాసు పోవు మెయిలు పదిహేను నిమిషములలో ఒకటవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌నకు వచ్చును.'

అమ్మాయిగొంతు స్పీకర్లో విన్పిస్తోంది.

అది తెలుగే! సందేహంలేదు!

ఆ తరువాత చెప్పే రెండు భాషలు అసలు అర్థంకావు. అంతలోనే పోర్టరు నారయ్యా వచ్చేడు.

"ఏం నారయ్యా, బాగున్నావా?"

"కూలోళ్ళబతుక్కి బాగోగులేంటిసార్" అంటూ తన సహజమయిన ధోరణిలో సంభాషణ ఆరంభించేడు నారయ్య. "ఈవేళ మీరు కాదంటే లాభం లేదుసార్. కంట్రాక్టరుగారికి మూడుబెర్తులు కావాలి. ఇదిగో పదిరూపాయలు"

ఆఖరు వాక్యం దూరంగా వున్న రామానుజం చెవిని పడకుండా మెల్లగా చెప్పి, ఆ నోటును చలపతి చేతిలో పెట్టబోయాడు నారయ్య.

చలపతి చేయి విదిలించుకున్నాడు.

"అలాగంటే ఎలా? పోనీ, మరో రెండు వుంచండి. ఆయన నాకిచ్చినవి పదిహేను రూపాయలు. మీకు పన్నెండు, నాకు కమీషను మూడు" నారయ్య రహస్యం చెబుతున్నట్లు మాట్లాడేడు.

చలపతి చికాకుగా లిస్టు అతని ఎదరపడేశాడు.

"ఇదిగో పెన్సిలు, బెర్తులు ఖాళీగా వుంటే నువ్వే రాసుకో"

నారయ్య మహాజ్ఞానిలాగ నవ్వేడు

"సార్! నేనోమాట చెప్పనా?"

"ఏమిటి?"

"కాగితాలు పెన్సిలు నా ఎదుట పడేసి రాసుకోమన్నారు. నేనే మీ సీటులో వుంటే ఇంకో పదిహేనుమందికి రాసి పారేద్దును. కానీ, నేను చదువుకోలేదు. నాకు రాయటం చేతకాదు"

"అదృష్టవంతుడివి, చదువురాకపోబట్టి హాయిగా వున్నావు లేకపోతే నువ్వెన్ని అన్యాయాలు చేద్దువో!"

"సార్! మీరు ఇవ్వాలనుకుంటే ఇవ్వొచ్చు మీకు మాత్రం తెలీదా? అన్నీ నేను చెప్పాలా?" అంటూ నవ్వేడు నారయ్య.

"నారయ్యా! ఇంకేం చెప్పకు. ఈ డబ్బు తీసుకుపో నాకువద్దు. ఆఖరున ఖాళీలు మిగిల్తే చూద్దాం ఇదిగో ఈ ముప్పయి పైసలూ తీసుకువెళ్ళి నాకు ఒక కాఫీ తెచ్చిపెట్టు. తలనొప్పిగావుంది"

"అలాగే సార్ నా సంగతి మరిచిపోవద్దు" అంటూ కాఫీ తీసుకురావటానికి వెళ్ళేడు నారయ్య. రెండుచేతులతో తలపట్టుకుని భారంగా కుర్చీలో వెనక్కు వాలేడు చలపతి.

బయటంతా కోలాహలంగా వుంది.

నాలుగో నెంబరు ప్లాట్‌ఫాంమీది పాసింజరు రైలు గట్టిగా కూతపెట్టింది. టిక్కెట్లు కట్టలుగా కట్టి వాటిని టేబిలుమీద పడేసి బయటకు వెళ్ళిపోయాడు రామానుజం.

గదిలో చలపతి ఒక్కడే మిగిలిపోయాడు. అంతలో శంకరం వచ్చేడు.

"ఏం శంకరం? డ్యూటీ అయిపోయిందా?" అడిగేడు.

"ఉదయం దిగేను గురూ! ఇదిగో ఈయన విశ్వనాధంగారని 'కాల్టెక్సు'లో పనిచేస్తున్నారు." అంటూ తనతో వచ్చిన నడివయస్కుడిని పరిచయం చేశాడు. పరిచయం పూర్తి అయిన తరువాత శంకరం చెప్పబోయేది చలపతికి తెలుసు.

"ఈయన మద్రాసు వెళ్ళాలిగురూ! ఒక బెర్తుసర్దు! లిస్టులో కుదరకపోతే కండెక్టర్‌తో నేను చెప్పేనని చెప్పి ఎక్కించెయ్"

"సరే!" అన్నాడు చలపతి

శంకరం కూడా స్లీపర్‌కోచ్ కండక్టరే, కాదని ఎలా చెప్పటం?

శంకరం ఆయనను వదిలి వెళ్ళిపోయాడు. విశ్వనాధం ఎదుటి కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమైనా మీ ఉద్యోగాలు సుఖంసార్. మేం 'షిఫ్టు' ల్లో పనిచేయలేక చచ్చిపోతున్నాం" అన్నాడు విశ్వనాధం. చలపతి నవ్వుకున్నాడు.

"చూడండి, మరొక్క అయిదు నిమిషాలలో మెయిలు వస్తుంది. అప్పుడు నా సుఖం చూద్దురుగాని మీరు. ఎ.సి. రూముల్లో పనిచేస్తూ షిఫ్టు డ్యూటీ'లని బాధపడుతున్నారు మీరు. పగలు ఎండలో, వానలో ఈ గాడిద చాకిరీలు చేయలేక, అందరినీ ఒప్పించలేక ఎవరిమెప్పు పొందలేక మేం సతమతవుతున్నాం. ఒక్కరాత్రి నిద్రపోవటానికి రైలులో బెర్తు చూపెట్టలేకపోతే, ప్లాట్‌ఫాం మీది మనుషులందరికీ మేం విరోధులమే! మీకున్న సౌకర్యాలు, సదుపాయాలు, ఈ విశాఖపట్నంలో ఎవరికున్నాయి చెప్పండి" అంటూ ఆగేడు చలపతి. వాటన్నిటికీ అంగీకరించినట్లు చిన్నగానవ్వి ఊరుకున్నాడు విశ్వనాధం.

అంతలో నారయ్య కాఫీ తెచ్చాడు.

"కాఫీ తీసుకోండి" అంటూ విశ్వనాధానికి ఆఫర్ చేశాడు.

"థేంక్యూ! నేను ఇప్పుడే తాగేను మీరు తీసుకోండి" కాఫీ తాగటం ముగించి తెల్లకోటు అందుకుని శరీరాన్ని అందులోనికి దూర్చేడు చలపతి. కోటులో దూరి బయటకు వెళ్తే రేచుకుక్కల్లా మీద పడతారు జనం. అయినా తప్పదు.

"మీరు మెయిలు వచ్చేక కౌంటరుదగ్గకి రండి. మెయిల్లో లిస్టువస్తేగానీ, పైనుండి ఎన్ని బెర్తులు ఖాళీగా వచ్చేయో తెలీదు. అప్పుడు మీకు ఎలాట్ చేస్తాను. లేదా అప్పారావుకి అప్పజెపుతాను" అంటూ విశ్వనాధాన్ని పంపించేసి, లిస్టులు తీసుకుని బయటకు నడిచేడు.రూం లోంచి బయటకు వస్తూంటే నానిగాడు కన్పించేడు.

"ఏరా నానీ! ఇలా వచ్చేవ్?"

"అమ్మ తమ్ముణ్ణి డాక్టరుగారి దగ్గరకు తీసుకువెళ్తుందిట. నిన్ను అడిగి అయిదు రూపాయలు తీసుకురమ్మంది" నానిగాడు తాను అప్పజెప్పవలసిన పాఠం అప్పజెప్పేసి తన బాధ్యత తీరిపోయినట్లు తండ్రి వంక చూస్తూ నిలబడిపోయాడు.

"డాక్టరు దగ్గరకి ఎందుకు?" జేబులోని రెండురూపాయల నోటు నానిగాడికి

అందిస్తూ అడిగేడు.

"ఉదయం నుండీ విరోచనాలవుతున్నాయి. తమ్ముడు బాగా నీరసంగా అయిపోయాడు"

"ఆ రెండు రూపాయలు ఇవ్వమను! సాయంకాలం వచ్చేటపుడు మిగిలిన డబ్బు తెస్తానులే" అంటూ వాడిని పంపించేశాడు. నానిగాడు కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

'హౌరా నుండి మద్రాసుపోవు మెయిలు ఒకటో నెంబరు ప్లాట్‌ఫారమ్‌నకు వచ్చుచున్నది' అంటూ స్పీకరులో గోల వినిపించింది. ప్లాట్‌ఫాం మీద సంచలనం ఆరంభమయింది. పోర్టర్లు తలగుడ్డలు సర్దుకుంటున్నారు.

సమూహంలో కదలిక! కోలాహలం! 'జీవ చైతన్యానికి సరియైన ప్రతీక రైల్వే ప్లాట్‌ఫాం కాబోలు" అనుకున్నాడు చలపతి. మెల్లగా నడిచి రిజర్వేషను బోను దగ్గరకు చేరుకున్నాడు. ఈలోగానే జనం వెంబడించటం ప్రారంభించేరు.

"లిస్టు రానివ్వండిసార్" అంటూ జనాన్ని తోసుకుంటూ బోనులోనికి చేరి తలుపులు బిగించుకున్నాడు. పెద్దగా శబ్దం చేస్తూ మెయిలు ప్లాట్‌ఫాం మీదకువచ్చి ఆగింది.

ఒక్కసారి జనమంతా కౌంటరు మీదకు ఎగబడ్డారు. చలపతికి లోపల ఊపిరి ఆడటంలేదు.

"మీరు క్యూలో నిలబడితే తప్ప ఎవ్వరికీ సహాయం చెయ్యలేను" అన్నాడు పెన్సిలు జేబులో నుండి తీస్తూ.

ఈ మాటలు చుట్టూవున్న జనానికి పట్టలేదు. మెయిల్లోంచి దిగిన కండక్టరు జనాన్ని తప్పించుకుంటూ "ఖాళీలన్నీ రెడ్‌పెన్సిలుతో నోట్‌చేశాను. లిస్టులు తీసుకో" అంటూ కాగితాలు చలపతి ఎదరపడేసి తన అవతారం చాలించి వెళ్ళిపోయాడు. లిస్టు 'వెరిఫై' చేసుకుని ఎన్ని ఖాళీలు వున్నాయో తేల్చుకునేసరికి మరో అయిదు నిమిషాలు పట్టింది. చుట్టూ మళ్ళీ గోల ప్రారంభమయింది.

"సార్! సార్! ఒక్క బెర్తుసార్"

"లేడీస్‌తో వున్నాం ఎలాగయినా మూడుబెర్తులు కావాలి"

'నెంబరు వెయిటింగ్ లిస్టులో వుంది.... బెర్తు ఇస్తారా"

"హౌ ఎటౌట్ మై బెర్త్?"

"చలపతీ! నా బెర్తుసంగతి చూడునాయనా"

"అంకుల్, కనీసం సీటు కావాలి"

రకరకాల కంఠాలు చలపతి మీద దాడి ఆరంభించేయి.

"దయచేసి గోల చెయ్యకండి సార్! క్యూలోకి రండి. ముందుగా రిజర్వ్

చేయించుకున్న వారి పేర్లు పిలిచి బోగీనెంబర్లు వేసి ఇస్తాను ఖాళీలను బట్టి వెయిటింగ్ లిస్టు వాళ్ళకి ఇస్తాను. నా డ్యూటీ నేను సక్రమంగా చేయాలంటే మీరందరూ నాకు సహకరించాలి. "ప్లీజ్ హెల్ప్ అజ్ టు హెల్ప్‌యూ"

సాధ్యమయినంత వినయంగా చెప్పేడు చలపతి. జనంలో కాస్త అల్లరి తగ్గింది.

రిజర్వేషను పేర్లు పిలుస్తూ బోగీనెంబర్లు వేసి ఇచ్చేడు. వెయిటింగ్‌లిస్టులో వున్న మొదటి నలుగురికీ, ఖాళీగా ఉన్న నాలుగు బెర్తులు సర్దేశాడు. ఖాళీగా వున్న పన్నెండుసీట్లు వెయిటింగ్ లిస్టులోని మిగిలిన వాళ్ళకి సర్దేడు.

లిస్టులు మడతపెట్టేసి "సారీసర్ అన్నీ పూర్తి అయిపోయాయి" అన్నాడు. జనం మళ్ళీ ఒక్కసారి ఎగబడ్డారు.

అంతలో మెయిలు అయిదునిమిషాలలో బయలుదేరనున్నట్లు స్పీకరులో వినిపించింది. జనం ఒక్కరొక్కరే కదిలి రైలువంక వెళ్ళిపోయారు. కాల్టెక్సు విశ్వనాధాన్ని కండెక్టరుకు అప్పగించవలసిన బాధ్యత ఇంకా మిగిలిపోయింది చలపతికి.

కటకటాల కౌంటరు తెరుచుకుని బోనులోని మేకపిల్ల బయటపడ్డట్లు ఇవతలికి వచ్చేడు. విశ్వనాధాన్ని తీసుకువెళ్ళి కండెక్టరుకు అప్పగించాడు. ప్రక్క కంపార్టుమెంట్‌లో కొచ్చిన్ వెళ్ళాల్సిన నిండుగర్భవతి నిలబడివుంది. కిక్కిరిసిన జనం మధ్య నిలబడి చలపతివైపు నిస్సహాయంగా చూసింది. చలపతి మనసు కరిగినీరయింది.

టూ టైర్ కండెక్టర్ వద్దకు వెళ్ళి "గురూ! చిన్న సహాయంచెయ్. కొచ్చిన్ వెళ్ళాల్సిన ఒకామె వుండిపోయింది. నిండు చూలాలు. నీకువీలయితే ఎక్కడయినా సర్దికూర్చోబెట్టు"

ఆ కండక్టరు చలపతి వంక విచిత్రంగా చూసేడు. తర్వాత అంతకంటె వింతగా నవ్వేడు. చలపతి ఒంటిమీద తేళ్ళు పాకినట్లయింది. తరువాత "తీసుకురా! నీకంటే ఆప్తులెవ్వరున్నారు నాకు?" అన్నాడు మళ్ళీ నవ్వుతూ.

చలపతి గబగబా వెళ్ళి ఆ నిండు చూలాలును దింపి తీసుకువచ్చి టూ టైర్‌లో ఎక్కించేడు. ఆమె కృతజ్ఞతా పూర్వకంగా చలపతి వంక చూసింది. ఆమె భర్త చలపతి చేతులు రెండూ పట్టుకుని 'థేంక్స్' చెప్పేడు.

'ఇవిగో! ఇవే! ఉద్యోగ జీవితంలో హాయిగొలిపే క్షణాలు!' అనుకున్నాను చలపతి మనసులోనే తరువాత 'రిటైరింగ్ రూము' వంక నడిచేడు. మెయిలు కూతపెట్టి మెల్లగా కదిలింది. రిటైరింగ్ రూం చేరుకునే సరికి నీరసం ముంచుకొచ్చింది అతనికి.

'మళ్ళీ జన్మలో అడవిలో మానుగా పుట్టించు! కానీ రైల్వేలో టి.సి.గా మాత్రం పుట్టించకు' అనుకున్నాడు చలపతి మనసులోనే.

సుమారు రెండు నెలలు గడిచిపోయాయి.

చలపతికి ఇపుడు నెత్తిన ముళ్ళకిరీటంలేదు. గేట్ దగ్గర టిక్కెట్లు చెక్ చేయటమే

అతని పని! ఎవరితోనూ విరోధాలు లేవు. మిగుల్చుకున్న పాత సఖ్యతకూడా ఏమీ లేదు.

తన డ్యూటీ ఎనిమిది గంటలూ తాను చేసుకోటం! ఎవరితోటీ ప్రమేయంలేదు. ఎవరి ఒత్తిడీ అంతకంటేలేదు. ఇప్పుడు తన చోటులో ప్రకాశం కొత్త టీ.సి.గా వచ్చేడు.

ప్రకాశం సమర్థుడే. బ్రతకనేర్చినవాడే ప్రస్తుతం ప్రకాశం చూపిస్తున్న చలాకీతనం తాను చూపించలేకపోయేవాడు. కారణం తనకే తెలీదు. రిజర్వేషన్ రూంలో కూర్చుని టికెట్స్ సార్ట్ అవుట్ చేస్తున్నాడు చలపతి. మెయిలు వచ్చేవేళ అయింది.

ప్రకాశం రిజర్వేషను ఛార్టు ముందేసుకుని కూర్చున్నాడు. అంతలోనే మెయిలు ప్లాట్‌ఫాం మీదికి వస్తున్నట్లు ప్రకటన వినిపించింది. ప్రకాశం కోటు తొడుక్కున్నాడు.

పైకి లేస్తూ అన్నాడు 'చలపతీ మా రెండోవాడు వస్తే కూర్చోమని చెప్పు మెయిలు పనిచూసుకుని వస్తాను" అలాగే అన్నట్లు తలవూపేడు చలపతి

ప్రకాశం వెళ్ళిపోయాడు.

మెయిల్ వచ్చి ప్లాట్‌ఫాంమీద ఆగింది.

"సార్! మానాన్నగారు వున్నారా?"

తలఎత్తి చూసేడు చలపతి. ప్రకాశం రెండో కొడుకు! పదమూడేండ్లవాడు!! టెర్లిన్ బట్టల్లో రాకుమారినిలా కనిపించేడు. కుర్రవాడి కళ్ళనిండా దర్పం, విశ్వాసం కన్పించేయి. వెంటనే చలపతికి తన రెండో కొడుకు గుర్తుకు వచ్చాడు.

వాడికి కడుపులో అల్సరు వుందన్నాడు డాక్టరు.

కడుపులో ఆకలే కాకుండా 'అల్సరు' కూడా వుంటుందని ఆవేళే తెలిసింది చలపతికి! దాన్ని ఆపరేట్ చేయించాలి.

ఆపరేషన్‌కు కనీసం రెండువందల రూపాయలవుతుంది. డబ్బుచాలక ఆపరేషను వాయిదా వేస్తూ వస్తున్నాడు. తన నిస్సహాయస్థితి జ్ఞాపకానికి వచ్చి కళ్ళు చెమ్మగిల్లేయి చలపతికి!

వెంటనే తేరుకుని "కూర్చోబాబూ వచ్చేస్తారు', నువ్వేం చదువుతున్నావ్?" అని అడిగేడు.

"టెన్త్ క్లాస్" అన్నాడు ఆ కుర్రాడు.

ఇంకా ఏవేవో ప్రశ్నలు అడిగేడు చలపతి. అన్నిటికీ ధీమాగా సమాధానాలు చెప్పేడతడు. తన కొడుకు ఎప్పటికయినా ఇంత ధీమాగా మాట్లాడగలడా?

ఉహు! సాధ్యం కాదు! దరిద్రంలో వున్న ఏ మనిషీ తాను ధీమాగావుండలేడు. తన పిల్లల్ని ధీమాగా వుండేటట్లు పెంచలేడు.

అంతలోనే ప్రకాశం వచ్చేడు మెయిలు వెళ్ళిపోవటానికి సిద్ధంగా కూతవేస్తోంది.

"గుడ్! వచ్చేశావా! ఇదిగో ఈ యాభయిరూపాయలు తీసుకువెళ్ళి మీ అమ్మకి ఇవ్వు! ఏదో చీర కొనుక్కోవాలంది" అంటూ జేబులో కుక్కిన నోట్లు తీసి కొడుకు చేతిలో

పెడుతున్నాడు ప్రకాశం.

చలపతి తనకేమీ తెలియనట్లు ప్లాట్‌ఫారం మీదకు వచ్చేశాడు.

ప్రకాశం దగ్గర ఆ డబ్బంతా ఈ కొద్ది నిమిషాలలో ఎలా చేరిందో చలపతికి తెలుసు. ప్రకాశం తెలివయినవాడు. భవిష్యత్తుకోసం బంగారు సోపానాలు నిర్మించుకుంటున్నాడు.

మరి తనో?!! ఎన్నో వేలమందికి సుఖమయిన ప్రయాణం కోసం పడకలు, సీట్లు రిజర్వ్ చేసి ఇచ్చేడు. కానీ తన జీవనయానం సుఖంగా జరగటానికి మాత్రం తాను ఏమీ రిజర్వ్ చేసుకోలేదు.

అందరికీ ఫస్టుక్లాసుల్లోనూ, టూటైర్‌లోనూ ఎక్కించి తాను మాత్రం మామూలు ఇరుకు బోగీలో ప్రయాణిస్తున్నాడు.

'తాను జీవితంలో తప్పుచేశాడా? అవకాశం ఉన్నప్పుడు జార విడుచుకున్నాడా?' చాలాసేపు ఆలోచనలో వుండిపోయాడు చలపతి.

మెయిలు ప్లాట్‌ఫారం వదిలి మెల్లగా సాగిపోయింది.

ఆఖరి బోగీవంకే చూస్తూ కొంతసేపు వుండిపోయాడు. తరువాత దీర్ఘంగా నిట్టూరుస్తూ అనుకున్నాడు "నో! తాను జీవితంలో తప్పుచేయలేదు. అన్యాయార్జితానికి అవకాశాలుఅనేకం. అయినా తాను వాటిని వాడుకోలేదు. ఇకమీదట వాడుకోవటం జరగదుకూడా. తనకున్న తృప్తి ప్రకాశానికి ఎక్కడుంటుంది?.... భగవాన్! నన్ను మంచివైపుకే అన్నివేళలా నడిపించు!" ★

(యువ మంత్లీ మార్చి 1975)